'మనూ'ను సందర్శించిన కర్ణాటక ఉర్దూ అకాడమీ బృందం

రాయదుర్గం: మౌలానా అజాద్‌ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయాన్ని బుధవారం కర్ణాటక రాష్ట్రం బెంగళూరులోని ఉర్దూ అకాడమీ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్‌ సయ్యద్‌ ఐనుల్‌ హసన్‌ను కలిసి సత్కరించి పుస్తకాన్ని బహుకరించారు. అనంతరం పలు అంశాలపై ఆయన వారితో చర్చించారు. 26 ఏళ్ళుగా ఉర్దూ భాష, సాహిత్యం, నాగరికత, విద్య, అభ్యాసానికి సంబంధించి చురుగ్గా పనిచేస్తోందన్నారు. ఇరువురు కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నారు.

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

రాయదుర్గం: రాయదుర్గంలో వైభవ మహాలక్ష్మీ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలలో భాగంగా బుధవారం మండప పూజ, సకల దేవత హోమాలు, శ్రీచక్ర అలంకరణ పూర్వక విశేష దీపోత్సవం, వేదస్వస్తి వంటి పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో రాయదుర్గం నాగార్జున విద్యా సంస్థల చైర్మన్‌ అరుకల కృష్ణాగౌడ్‌, కరస్పాండెంట్‌ భరత్‌కుమార్‌, భక్తులు పాల్గొన్నారు.

20 స్టార్టప్‌ల ఎంపిక

ఇండియా గ్రీన్‌ ఇన్నోవేషన్‌ను ప్రోత్సహించేందుకే..

రాయదుర్గం: ఇండియా గ్రీన్‌ ఇన్నోవేషన్‌ను ప్రోత్సహించడానికి అటల్‌ ఇంక్యుబేషన్‌ సెంటర్‌(ఏఐసీ) సహకారంతో టీహబ్‌ 20 స్టార్టప్‌లను ఎంపిక చేసింది. పర్యావరణ నిర్వహణ పట్ల పెరుగుతున్న నిబద్ధతను ప్రతిబింబించేలా, స్థిరమైన పరిష్కారాలకు మార్గదర్శకత్వం వహిస్తున్న స్టార్టప్‌లకు మద్దతు ఇవ్వడం లక్ష్యంగా పెట్టుకుంది. అందులో భాగంగానే ఈ ఎంపిక జరిగింది. మొత్తం 220 మంది దరఖాస్తు చేసుకోగా, 20 స్టార్టప్‌లను ఎంపిక చేసినట్టు బుధవారం హైదరాబాద్‌ నాలెడ్జి సిటీలోని టీహబ్‌ వేదికగా సీఈఓ మహంకాళి శ్రీనివాసరావు ప్రకటించారు. ఏఐసీ టీహబ్‌ ఫౌండేషన్‌ సీఈఓ రాజేష్‌అడ్లా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎంపికైన స్టార్టప్‌లు ఇవే

ఎర్త్‌టిక్‌ ఇండియా, అంబియేటర్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌, హుంబెకో గ్రీన్‌ వెంచర్స్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌, రెవెరెంట్‌ టెక్నాలజీస్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌, మైప్లాన్‌ 8, పీస్‌ సోలార్‌, జీరో కార్బన్‌ వన్‌, నెట్‌జీరో లివింగ్‌, విసార్జ్‌ సిస్టమ్స్‌, సస్టెక్‌ ఇన్నోవేషన్స్‌, విట్రాన్స్‌ ఫార్మింగ్స్‌, ఎయిర్‌నోటే, న్యూబూ, థింక్‌స్మార్ట్‌ టెక్నాలజీ(క్లీన్‌కార్బన్‌), ఎలక్ట్రిక్‌బీ ప్రైవేట్‌ లిమిటెడ్‌ (సోలార్‌ఫిక్స్‌) సీఐ మెట్రిక్స్‌, గుడ్‌బ్యాగ్‌ స్టార్టప్‌లు ఎంపికైన వాటిలో ఉన్నాయి.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం

ఆల్విన్‌కాలనీ: పరిసరాల శుభ్రతతో వ్యాధులు రావని, ప్రజలు చెత్తను వీధుల్లోనూ, కాలువలోను వేయకుండా చెత్త సేకరించే ఆటోలలో మాత్రమే వేయాలని కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌ గౌడ్‌ సూచించారు. ఆల్విన్‌కాలనీ డివిజన్‌ పరిధిలోని పరికి చెరువు పరిసర ప్రాంతాల్లో దోమలు ప్రబలాయని ప్రజలు కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన బుధవారం ఎంటమాలజి సిబ్బందితో కలిసి చెరువులో ఎంఎల్‌ఓ ఆయిల్‌ బాల్స్‌ను వేశారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, ఫారుఖ్‌, ఖలీమ్‌, స్వామి, రాజు, రవిసాగర్‌, రాము, ఎంటమాలజి సూపర్‌వైజర్‌ నరసింహులు, ఎంటమాలజి సిబ్బంది పాల్గొన్నారు.

యువత స్వయం ఉపాధితో ఎదగాలి

మియాపూర్‌: మియాపూర్‌లోని అరబిందో కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎఫ్‌–3 ఫుడ్‌ కోర్టును స్థానిక కార్పొరేటర్‌ ఉప్పలపాటి శ్రీకాంత్‌ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యువత స్వయం ఉపాధితో ఎదగాలని తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు క్రాంతి, వివేక్‌, సంతోష్‌ ముదిరాజ్‌, నాయకులు జహంగీర్‌, హన్మంత్‌రావు పాల్గొన్నారు.

జాతీయ పతాకాల పంపిణీ



విద్యార్థులకు జెండాలు పంపిణీ చేసిన సుచరితరెడ్డి

రాయదుర్గం: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలి డివిజన్‌ ఖాజాగూడలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో పైడి రాకేష్‌రెడ్డి ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో విద్యార్థులకు జాతీయ పతాకాలను పంపిణీ చేశారు. పైడి రాకేష్‌రెడ్డి ఫౌండేషన్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ సుచరితరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం ప్రాణ త్యాగం చేసిన మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్‌ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తళుక్కుమన్న హెచ్‌సీయూ



రాయదుర్గం: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని హెచ్‌సీయూ త్రివర్ణ పతాక రంగులతో కూడిన విద్యుత్‌ దీపాలతో జిగేల్‌మంది. హెచ్‌సీయూ క్యాంపస్‌లోని పరిపాలనా భవనం, ప్రధాన గేటు, హెచ్‌సీయూ బోర్డు తళుక్కుమంటోంది.

దిష్టిబొమ్మ దహనం

రాయదుర్గం: పశ్చిమబెంగాల్‌ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ దిష్టిబొమ్మను హెచ్‌సీయూ క్యాంపస్‌లో ఏబీవీపీ శాఖ ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ మహిళా ప్రతినిధులు మాట్లాడుతూనిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ హెచ్‌సీయూ అధ్యక్షుడు బాలకృష్ణ, ప్రతినిధులు అంకిత, చవి, పల్లవి, నిధి పాల్గొన్నారు.

'ఎవ్రీ డే ఇండియా' చిత్ర ప్రదర్శన

లక్డీకాపూల్‌: దేశమంటే మతమూ.. రాజకీయాలూ కాదు, మట్టి – మనుషులు అన్న భావనతో సామాన్యుల స్థితికి అద్దంపట్టనున్నది ఈ చిత్ర ప్రదర్శన. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆర్ట్‌ గ్యాలరీలో ఎవ్రీ డే ఇండియా పేరిట ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశారు. సామాన్యశాస్త్రం పేరుతో పని చేస్తున్న ఇండిపెండెంట్‌ జర్నలిస్ట్‌, ఫొటోగ్రాఫర్‌ కందుకూరి రమేష్‌ బాబు ఈ చిత్ర ప్రదర్శనను నిర్వహిస్తున్నారు. ఇందులో ముంబై, కోల్‌కత్తా, ఢిల్లీ సహా రెండు తెలుగు రాష్ట్రాల్లో రమేష్‌ తీసిన 60 చిత్రాలు కొలువుతీరనున్నాయి. ఈ ప్రదర్శనను పల్లె సృజన అధ్యక్షుడు, రిటైర్డ్‌ బ్రిగేడియర్‌ గణేశం గురువారం ప్రారంభించనున్నారు. ఈ నెల19వ తేదీ వరకు కొనసాగే ఈ ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి సా.7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

ఆటస్థలం అడ్డాగా మారింది



నిరుపయోగంగా హుడా కాలనీ ప్లే గ్రౌండ్‌



హుడా కాలనీ ప్లే గ్రౌండ్‌లో ప్రైవేట్‌ సంస్థకు చెందిన పైపులు

పట్టించుకోని జీహెచ్‌ఎంసీ అధికారులు • ఓవైపు పైపుల డంపింగ్‌, మరోవైపు అసాంఘిక కార్యకలాపాలు



హుడా కాలనీ ప్లే గ్రౌండ్‌ ముందు పోసిన భవన నిర్మాణ వ్యర్థాలు

చందానగర్‌: చందానగర్‌ హుడా కాలనీలో జీహెచ్‌ఎంసీ ప్లే గ్రౌండ్‌ నిరుపయోగంగా ఉంది. సుమారు ఎకరం స్థలం ఉంది. జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు నగర వ్యాప్తంగా పార్కులతో పాటు ఆటస్థలాలను అభివృద్ధి చేస్తుంది. కానీ హుడా కాలనీలో ఉన్న ప్లే గ్రౌండ్‌ను మాత్రం పట్టించుకోవడం లేదు. ఈ స్థలంలో వాటర్‌వర్క్స్‌ అధికారులు, ప్రైవేట్‌ సంస్థకు చెందిన పైపులు డంపింగ్‌ చేశారు. ప్రధాన గేట్లు ధ్వంసం అయ్యాయి. దీంతో రాత్రి సమయాలలో అసంఘటిత కార్యక్రమాలు జరుగుతున్నాయని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక వైపు పైపులు, పిచ్చిమొక్కలు, మరో వైపు భవన నిర్మాణ వ్యర్థాలు వేస్తుండడంతో ఇబ్బందికరంగా తయారైంది. ఉన్నతాధికారులు పట్టించుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

- హుడా కాలనీలోని జీహెచ్‌ఎంసీ ప్లే గ్రౌండ్‌ను అభివృద్ధి చేయాలి
- ధ్వంసమైన ప్రధాన గేటుతో పాటు వీధి దీపాలను బాగు చేయాలి
- గ్రౌండ్‌లో పెరిగిన పిచ్చిమొక్కలు, పైపులను తొలగించాలి
- రాత్రి సమయాలలో కొంతమంది మద్యం తాగుతూ ఇబ్బందులు కలిగిస్తున్నారు. వీరిపై పోలీసులు నిఘా ఉంచాలి
- భవన నిర్మాణ వ్యర్థాలు వేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి
- గ్రౌండ్‌లో చెత్త చెదారం వేయకుండా చూడాలి.

ప్లే గ్రౌండ్‌ను అభివృద్ధి చేయాలి



హుడా కాలనీలోని జీహెచ్‌ఎంసీ ప్లే గ్రౌండ్‌ను అధికారులు పట్టించుకోవాలి. కాలనీవాసులకు వాకింగ్‌ట్రాక్‌తో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా తీర్చిదిద్దాలి.

– నవీన్‌, హుడా కాలనీ

డంపులతో ఇబ్బందులు



జీహెచ్‌ఎంసీ హుడా కాలనీ ప్లే గ్రౌండ్‌లో భవన వ్యర్థాలు, పైపులతో ఆడుకోవడానికి ఇబ్బందులు కలుగుతున్నాయ్‌. తక్షణమే జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు ఆటస్థలాన్ని పరిశీలించి ప్రత్యేక నిధులతో అభివృద్ధి చేయాలి.

– విజయ్‌కుమార్‌, హుడా కాలనీ



హుడా కాలనీ ప్లే గ్రౌండ్‌ బోర్డును కప్పి వేసిన మొక్కలు



గ్రౌండ్‌లో మద్యం సీసాలు



విరిగిన ప్రహరీ గోడ, ధ్వంసమైన ప్రధాన గేటు

ఖాజాగూడలో ఆర్టీసీ లాజిస్టిక్‌ సేవలు ప్రారంభం

రాయదుర్గం: గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ డిపో పరిధి ఖాజాగూడలో ఆర్టీసీ లాజిస్టిక్‌ కొరియర్‌ సేవలను బుధవారం ప్రారంభించారు. ఈ కేంద్రాన్ని సంస్థ డిప్యూటీ సీటీఎం మధుసూదన్‌, ఏటీఎం నారాయణ ప్రారంభించారు. ఆర్టీసీ మార్కెటింగ్‌ బృందం శ్రావణ్‌, ప్రదీప్‌, విజేందర్‌రెడ్డి, రమేష్‌, జంబన్న, ఏజెంట్‌ సాహిత్‌కుమార్‌ పాల్గొన్నారు.

రాజీవ్‌ సద్భావన యాత్రకు ఘన స్వాగతం



చందానగర్‌: రాజీవ్‌ సద్భావన యాత్ర బుధవారం శేరిలింగంపల్లి నియోజకవర్గంలోకి ప్రవేశించింది. కాంగ్రెస్‌ పార్టీ నియోజకవర్గం ఇంచార్జ్‌ జగదీశ్వర్‌గౌడ్‌ యాత్రకు ఘన స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ రాజీవ్‌ గాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివన్నారు. జీహెచ్‌ఎంసీ లేబర్‌ సెల్‌ చైర్మన్‌ నల్ల సంజీవరెడ్డి, వీరేందర్‌గౌడ్‌ కృష్ణ, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు విజయభాస్కర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, పట్వారీ శశిధర్‌, అల్వాల్‌ భాస్కర్‌, అక్తర్‌ సింగ్‌ పాల్గొన్నారు.

కిడ్నాపైన బాలిక క్షేమం

తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

గచ్చిబౌలి: కిడ్నాప్‌కు గురైన బాలికను కొద్ది గంటల్లోనే పోలీసులు తల్లిదండ్రుల చెంతకు చేర్చిన ఘటన రాయదుర్గం పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్‌ వెంకన్న తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రాయదుర్గం ప్రభుత్వ పాఠశాలలో రెండవ తరగతి చదివే బాలిక(08) బుధవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఇంటికి వెళ్లేందుకు పాఠశాల ముందు నిలబడి ఉంది. మేడ్చల్‌లో నివాసం ఉండే సెంట్రింగ్‌ కార్మికుడు మధ్యప్రదేశ్‌కు చెందిన శంకర్‌(24) అటుగా వచ్చాడు. ఇంటి దగ్గర డ్రాప్‌ చేస్తానని చెప్పి చాక్లెట్‌ ఇప్పించి బైక్‌పై ఎక్కించుకొని వెళ్లాడు. తల్లిదండ్రుల ఫిర్యాదుతో రాయదుర్గం పోలీసులు గాలిస్తుండగా ఖాజాగూలో బాలికతో సహా చిక్కాడు. బాలికను తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు నిందితుడిని అరెస్ట్‌ చేశారు.

కొత్త సబ్‌స్టేషన్‌లు ఏర్పాటు చేయాలి

ఎమ్మెల్యే గాంధీ.. పారిశుద్ధ్యం, విద్యుత్‌ సమస్యలపై సమీక్ష



టీజీఎస్‌పీడీసీఎల్‌ సైబర్‌సిటీ విభాగం అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: ప్రజా అవసరాల దృష్ట్యా కొత్త సబ్‌స్టేషన్‌లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. బుధవారం సైబర్‌సిటీ డివిజన్‌ టీజీఎస్‌పీడీసీఎల్‌ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్‌స్టేషన్ల ఏర్పాటు ప్రతిపాదనలు తీసుకొస్తే జిల్లా కలెక్టర్‌ దృష్టికి తీసుకెళ్లి స్థలం ఇప్పిస్తానని చెప్పారు. ప్రజలకు నాణ్యమైన నిరంతరాయంగా విద్యుత్‌ అందించటమే ధ్యేయంగా పనిచేయాలని సూచించారు. వివిధ ప్రాంతాల్లో శిథిలావస్థకు చేరిన విద్యుత్‌ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలన్నారు. అదే విధంగా ప్రమాదకరంగా ఉన్న విద్యుత్‌ వైర్లను తొలగించాలన్నారు. కార్యక్రమంలో సైబర్‌ సిటీ ఎస్‌ఈ వెంకన్న, డీఈలు గరుత్మంతరాజు, రవికుమార్‌, కమలాకర్‌రెడ్డి, ఏడీఈ శ్యామ్‌ ప్రసాద్‌, ఏఈలు వెంకట రమణా రెడ్డి, శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై..

శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో నెలకొన్న పారిశుద్ధ్యం, భవన నిర్మాణ వ్యర్థాల తరలింపుపై ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య పనుల నిర్వహణపై అలసత్వం ప్రదర్శిస్తే సహించమన్నారు. కాలనీ, బస్తీల్లో, ప్రధాన రహదారులపై చెత్త పేరుకు పోయిందని, వర్షాలు పడినపుడు కాలువల్లో చెత్త వల్ల నీటి ప్రవాహం సాఫీగా సాగకుండా మురుగు రోడ్లపైకి వస్తుందన్నారు. వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉందన్నారు. పారిశుద్ధ్యంపై ఏఎంఓహెచ్‌ల పర్యవేక్షణ ఎప్పుడూ ఉండాలని సూచించారు.

కంచె ఏర్పాటును అడ్డుకుంటే కఠిన చర్యలు

హుడా అధికారి దివ్యారెడ్డి



పనులను పరిశీలిస్తున్న హుడా అధికారిణి దివ్యారెడ్డి

మియాపూర్‌: మియాపూర్‌లోని 100, 101 సర్వేనంబర్‌లోని హుడా భూమిలో కంచె ఏర్పాటు చేసే సమయంలో అడ్డుపడితే కఠిన చర్యలు తప్పవని హుడా అధికారి దివ్యారెడ్డి హెచ్చరించారు. మియాపూర్‌లోని 100 ,101 సర్వేనంబర్‌లోని హుడా భూమి చుట్టు కంచె ఏర్పాటు పనులను డీఈ సత్యప్రసాద్‌, హుడా సీఐ తిరుపతి, సైట్‌ ఎస్టేట్‌ అధికారి గౌతమ్‌లతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కంచె ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. కాగా మియాపూర్‌లోని ఎంఎనగర్‌లో హుడా అధికారులు కంచె ఏర్పాటు చేసే సమయంలో బుధవారం స్థానికులకు, అధికారులకు స్వల్ప వివాదం చోటుచేసుకుంది.

నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలి

'ఎస్కీ' డైరెక్టర్‌ డాక్టర్‌ జి రామేశ్వరరావు



కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు, డైరెక్టర్‌ రామేశ్వరరావు

రాయదుర్గం: జీవితంలో ఎదగడానికి ప్రతి మనిషి కఠోర శ్రమ చేయాలని ఇంజనీరింగ్‌ స్టాఫ్‌ కాలేజ్‌ ఆఫ్‌ ఇండియా డైరెక్టర్‌ డాక్టర్‌ జి రామేశ్వరరావు అభిప్రాయపడ్డారు. గచ్చిబౌలి 'ఎస్కీ'లోని స్కూల్‌ ఆఫ్‌ పోస్ట్‌ గ్రాడ్యుయేట్‌ స్టడీస్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇండస్ట్రీ అండ్‌ అకాడెమియా ఇంటరాక్షన్‌ కార్యక్రమాన్ని చాణక్య సెమినార్‌ హాల్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా రాణించాలంటే వారు ఎంచుకున్న మార్గంలో కఠోర పరిశ్రమతోనే అది సాధ్యమవుతుందన్నారు. అకడమిక్‌ కెరీర్‌లో చదవడం ఒక భాగం అయితే అకాడెమియా అనేది పరిశోధన, ఆవిష్కరణల మీద ఆధారపడి ఉంటుందన్నారు. విద్యార్థి లోతైన పరిశోధనలు చేయాలన్నారు. చదువులతోపాటు నూతన ఆవిష్కరణలపై విద్యార్థులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పోస్టుగాడ్యుయేట్‌ స్టడీస్‌ ప్రిన్సిపల్‌ డాక్టర్‌ ఏ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్కీ ఒక ప్రతిష్ఠాత్మకమైన విద్య, శిక్షణా సంస్థగా గుర్తింపు సాధించిందన్నారు. టాటా ప్రాజెక్ట్స్‌ ప్రతినిధి డాక్టర్‌ శంకర్‌ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువు తోపాటు నైపుణ్యాలను నేర్చుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. స్కిల్‌ డెవలప్‌మెంట్‌ ఆఫ్‌ ఇండియా మహిళా విభాగం హెడ్‌ సునీత లంకా మాట్లాడారు. కార్యక్రమంలో గ్లోబల్‌ గ్రూప్‌ డిప్యూటీ సీఈఓ వేణుమాధవ్‌, ఏడీబీ ప్రతినిధి శ్రీధర్‌ పోలిశెట్టి, ఏసీఈ ప్రతినిధి రోహిత్‌ భరద్వాజ్‌, స్ప్రింట్‌ రే ప్రతినిధి సునీత, టీఎంటీ ప్రతినిధి రాజీవ్‌ బిష్త్‌ ప్రసంగించారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ ప్రతినిధులు, ఎస్కీ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత ఆపరేషన్లు

మోతీనగర్‌: కూకట్‌పల్లిలోని ఆకార్‌ ఆశ ఆసుపత్రి, సైబరాబాద్‌ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో త్వరలో నిర్వహించే ఉచిత ఆపరేషన్లను సద్వినియోగం చేసుకోవాలని అల్లాపూర్‌ పోలీస్‌స్టేషన్‌ గాయత్రీనగర్‌ సెక్టార్‌ ఎస్‌ఐ దేవరాజ్‌ బుధవారం తెలిపారు. చిన్నారులకు ఉచిత చికిత్స కోసం అవసరమైన వారు అల్లాపూర్‌ పోలీస్‌స్టేషన్‌లో పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. శారీరక వైకల్యం, పుట్టుకతో అంగవైకల్యం, కాలిన గాయాలు, గ్రహణ మొర్రి తదితరాలకు చికిత్స అందిస్తారని తెలిపారు.

15 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్‌: డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌లో పట్టుబడ్డ 15 మంది వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు రూ. 2 వేల చొప్పున జరిమాన, ఒకరికి జరిమానాతో పాటు 3 రోజుల జైలు శిక్ష విధించిందని ట్రాఫిక్‌ సీఐ లాలూనాయక్‌ తెలిపారు.సోమ ,మంగళవారాల్లో డ్రైవ్‌ నిర్వహించామని చెప్పారు.

ఘనంగా హర్‌ ఘర్‌ తిరంగా

మాదాపూర్‌: మాదాపూర్‌లోని సీసీఆర్టీలో బుధవారం సంగీత్‌ నాటక్‌ అకాడమీ, దీపాంజలి స్కూల్‌ ఫర్‌ ఎక్సలెన్స్‌ ఇన్‌ కూచిపూడి ఆధ్వర్యంలో హర్‌ ఘర్‌ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో చేవేళ్ళ పార్లమెంట్‌ సభ్యులు కొండావిశ్వేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికసిత్‌ భారత్‌వైపు పరుగులు పెడుతున్న మనదేశ ప్రగతిలో మనం కూడా భాగమవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జ్‌ రవికుమార్‌ యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.



మాదాపూర్‌ సీసీఆర్టీలో..

హెచ్‌సీయూ క్యాంపస్‌ స్కూల్‌లో..

రాయదుర్గం: గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్‌ స్కూల్‌ ఆధ్వర్యంలో హర్‌ ఘర్‌ తిరంగా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. క్యాంపస్‌ స్కూల్‌ నుంచి ప్రారంభించిన ర్యాలీ ఉద్యోగుల గృహ సముదాయం, పోస్ట్‌ ఆఫీస్‌ నుంచి తిరిగి క్యాంపస్‌ స్కూల్‌ వరకు కొనసాగింది.ఈ సందర్భంగా ర్యాలీని ప్రారంభించిన పాఠశాల ప్రిన్సిపల్‌ పి మురళి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే దేశభక్తిని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



హెచ్‌సీయూ స్కూల్‌లో

నేడు ఆరోగ్యకరమైన ఆహారం క్లిష్టమైన సమస్య

- పండ్లు, కూరగాయలపై రసాయనాలు, భారీ లోహాల స్థాయిపై ఆందోళన
- హెచ్‌సీయూ ప్యానల్‌ చర్చలో వక్తలు



హెచ్‌సీయూలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

రాయదుర్గం: నేడు పోషకాహారం, ఆరోగ్యకరమైన ఆహారం క్లిష్టమైన సమస్యగా మారిందని వక్తలు అభిప్రాయపడ్డారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలోని ఎస్పైర్‌–బయోనెస్ట్‌ ఆధ్వర్యంలో ఐకేపీ హైదరాబాద్‌లో 'మై ప్లేట్‌ ఫర్‌ ది డే: రియల్‌ ఇన్‌సైట్స్‌ ఇన్‌ ది డైటరీ గైడ్‌లైన్స్‌ బై ఐసీఎంఆర్‌, ఎన్‌ఐఎన్‌' అనే అంశంపై ప్యానల్‌ చర్చా కార్యక్రమాన్ని స్కూల్‌ ఆఫ్‌ లైఫ్‌ సైన్సెస్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ముఖ్యంగా పండ్లు, కూరగాయలలో పెరుగుతున్న పురుగు మందులు, భారీ లోహాల స్థాయిలపై ఆందోళన వ్యక్తం చేశారు. స్థిరమైన పరిష్కారం కోసం పట్టణ వ్యవసాయం అవసరమన్నారు. చిన్న వయస్సు నుంచే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాల స్థాయి నుంచే సమతుల్య ఆహారాన్ని ప్రభుత్వాలు ప్రోత్సహించాలని వారు అభిప్రాయపడ్డారు. జంక్‌ ఫుడ్స్‌ పూర్తిగా మానుకోవాలన్నారు. రోజువారీ జీవితంలో ఐసీఎంఆర్‌, ఎన్‌ఐఎన్‌ ఆహార మార్గదర్శకాలను అమలు చేయాలని వారు సూచించారు. ఎస్పైర్‌ బయోనెస్ట్‌ ఇంక్యుబేషన్‌ మేనేజర్‌ డాక్టర్‌ హర్షిత, బీఐఆర్‌ఏసీ సీనియర్‌ ప్రోగ్రామ్‌ ఆఫీసర్‌ మితికా కశ్యప్‌ తమ సంస్థ లక్ష్యాలను, పనితీరును వివరించారు. కాగా సెప్టెంబర్‌ 12–14 వరకు న్యూఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో గ్లోబల్‌ బయో ఇండియా ఈవెంట్‌ నిర్వహించాలని నిర్ణయించారని ఈ సందర్భంగా అతిథులు ప్రకటించారు. న్యూట్రాస్యూటికల్‌ కంపెనీ మిరాకిల్‌ వ్యవస్థాపకుడు మైత్రేమ్‌ మురళి, అర్బన్‌ కిసాన్‌ సహ వ్యవస్థాపకుడు డాక్టర్‌ సాయిరామ్‌రెడ్డి, అసోసియేట్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ అజయ్‌ తుమానీ, ఇతర ప్రతినిధులు ప్రసంగించారు. కార్యక్రమంలో ఐకేపీ హైదరాబాద్‌ సీనియర్‌ మేనేజర్‌ అపూర్వ భట్నాగర్‌, ఫారెస్ట్‌ కాలేజ్‌ అండ్‌ రీసెర్చ్‌ ఇన్‌స్టిట్యూట్‌, హెచ్‌సీయూలకు చెందిన ఫ్యాకల్టీ, విద్యార్థులు పాల్గొన్నారు.